www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 ఆగస్టు 2025
5
తిరుపతి



తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె

ప్రజాశక్తి - తిరుమల



ఆడికతిక పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు శనివారం శ్రీవారి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో తిరుత్తణి ఆలయ చైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రమణి టీటీడీ చైర్మన్‌కు స్వాగతం పలికారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ టీటీడీ తరపున శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి శ్రీవారి పట్టువస్త్రాలను సమర్పించడం సంతోషంగా ఉందన్నారు.

శ్రీ స్వామి హథీరాంజీ మఠం భవనం కూల్చివేతకై...

ముగిసిన టెండర్ ప్రక్రియ

- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్నది 32 మంది
- దక్కించుకున్న పుత్తూరు పయనీర్ స్టీల్స్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారికి ప్రియమైన భక్తుడిగా గుర్తింపు పొందిన శ్రీ స్వామి హథీరాం బావాజీకి చెందిన తిరుపతి గాంధీ రోడ్డులోని మఠం భవనం శిథిలావస్థకు చేరడంతో ఎండోమెంట్ కమిషనర్, నగరపాలక సంస్థ కమిషనర్ నోటీసులతో మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి కూల్చివేత ప్రక్రియకు సంబంధించి శనివారం టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ టెండర్ల ప్రక్రియకు సంబంధించి కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, పుత్తూరు, తిరుపతి వివిధ ప్రాంతాలకు సంబంధించి ఆన్ లైన్ లో బిడ్ దాఖలు చేసిన ఐదు మందితోపాటుగా 27 మంది ఆఫ్ లైన్ మొత్తం కలిపి 32 మంది ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారు. మఠం భవనం కూల్చివేసే సమయంలో అక్కడి మెటీరియల్ కు సంబంధించి నిర్వహించిన టెండర్ ప్రక్రియలో మొదటగా ఆన్ లైన్ లో రూ.37 లక్షల రూపాయలకు బిడ్ దాఖలు కావడంతో, మఠం అధికారులు రూ.37 లక్షల నుండి వేలంపాటను ప్రారంభించగా పుత్తూరుకు సంబంధించిన పయనీర్ స్టీల్స్ వారు రూ.97 లక్షల 20 వేల రూపాయలకు హెచ్చు పాటను నమోదు చేశారు. అలానే భవనం కూల్చివేతకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలో రూ.1 లక్షా 50 వేల రూపాయలను హెచ్చుపాటగా నమోదు చేయడంతో వీరికి రెండు టెండర్లను ఇస్తున్నట్లుగా మఠం అధికారులు ప్రకటించారు.

సమన్వయ సమావేశం నిర్వహిస్తాం : బాపిరెడ్డి, పరిపాలనా అధికారి, మఠం



వేలంపాట ముగిసిన అనంతరం మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి మాట్లాడుతూ శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి ప్రస్తుతం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ వివరాలను, మఠన్ ద్వారా లీజు ప్రతిపాదికన దుకాణాలు పొందిన వారి పరిస్థితిని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వారికి రిపోర్టు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడి వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి అటు తర్వాత సయోధ్య నిర్ణయాన్ని తీసుకుని టెండర్ దక్కించుకున్న వారికి మఠం భవనం కూల్చివేతకు సంబంధించి ఆర్డర్ కాపీలను ఇస్తాము.

దుకాణదారులకు న్యాయం చేయాల్సిందే : మబ్బు దేవనారాయణరెడ్డి

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ద్వారా లీజు ప్రతిపాదికన దుకాణాలను పొందిన వారికి ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా అధికారులు ముందుకు సాగితే ఎంతకైనా పోరాడతామని టిడిపి నేత మబ్బు దేవనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మఠంలో జరుగుతున్న టెండర్ ప్రక్రియ సమయంలో ఆయన దుకాణదారులతో కలిసి మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. దుకాణదారులకు అన్యాయం జరిగితే పోరాటం చేయడానికి వెనుకాడమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఇప్పటికే వినతి ఇచ్చామన్నారు.

రీటెండరింగ్ నిర్వహించాలి నూర్ షరీఫ్, గుత్తేదారు, రాజమండ్రి



శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి శనివారం జరిగిన టెండర్ ప్రక్రియ వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా జరిగిందని, ఐఐటి నివేదిక ప్రకారం మఠం మండువా భవనం ప్రాంతంలో ఎక్కడ నుండి ఎక్కడి వరకు కూల్చివేతలు నిర్వహిస్తారు అన్నదానిపై ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా టెండర్లు నిర్వహించడం సమంజసం కాదని, జిల్లా కలెక్టర్ ఈ టెండర్ ప్రక్రియలో జోక్యం చేసుకొని రిటెండరింగ్ నిర్వహిస్తే ఇప్పుడు మఠం అధికారులు టెండర్లు కోట్ అయిన నగదు కంటే మరింతగా వేలంపాట నగదు పెరిగే అవకాశం ఉందని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని కలెక్టర్ మఠం భవనం కూల్చివేతకు సంబంధించి రీటెండరింగ్ కు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. మరోవైపు దుకాణదారులకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా టెండర్ ప్రక్రియ చేయడం చూస్తుంటే టెండరు దక్కించుకున్న వారికి నష్టం చేకూర్చే పరిస్థితులు ఉన్నాయి.

కేంద్రమంత్రిగా 'దగ్గుమళ్ల'..?

త్వరలోనే క్యాబినెట్ విస్తరణ



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్రమంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ క్యాబినెట్‌కు అవకాశం ఇచ్చారు. మూడో మంత్రి పదవిని ఆంధ్రాకు ఇవ్వనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై జరిగే సమావేశానికి హాజరుకానున్న నారా చంద్రబాబుకు కేంద్ర క్యాబినెట్ విస్తరణ, ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలనే విషయమై చర్చ జరగనుంది. ఈ నేపథ్యంలో బిజెపి, జనసేన నుంచి కేంద్రమంత్రి పదవి ఆశించినప్పటికీ, టిడిపికే ఇవ్వాలని ఎన్‌డిఎ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు మధ్యే పదవీ పోటీ నెలకొంది. ఎస్సీ సామాజికవర్గం కోటాలో మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ లెక్కన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు కేంద్ర సహాయ మంత్రి ఇచ్చే అవకాశం మెండుగా ఉంది.

బాపట్ల జిల్లాకు చెందిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు ఆహ్వానం మేరకు 2024 ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఎవరికీ సాధ్యం కాని విధంగా పార్టీలోకి వచ్చిన రెండు నెలలకే ఎంపిగా భారీ మెజార్టీతో గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వైసిపి సమీప అభ్యర్థి రెడ్డెప్పపై 2 లక్షల 23వేల మెజార్టీతో గెలుపొంది పార్లమెంట్‌లో ప్రవేశపెటించారు. ఎంపిగా నియోజకవర్గంలో నెలలో 15-20 రోజులు ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఏడాది కాలంలో 10 కోట్లకు పైగా ఎంపి నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా సిసి రోడ్లు, కొత్తగా సిక్స్‌లైన్ పడడంతో గ్రామాల మధ్య కనెక్టివిటి కోసం రైల్వే బ్రిడ్జిలు, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారని కూటమి కార్యకర్తలు చెబుతున్నారు. పార్లమెంట్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గానూ, ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిటీలో మెంబర్‌గానూ ఉన్నారు. మరో మూడు జాతీయ కమిటీల్లోనూ దగ్గుమళ్ల చురుగ్గా ఉన్నారు. ఈ ఐదు కమిటీల్లో దగ్గుమళ్ల ప్రసాద్‌రావు చేస్తున్న కృషిని మోడీ ప్రధాని గతంలో వ్యక్తిగతంగా అభినందించారు. కేంద్ర క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో ఆంధ్రాలో మంత్రి పదవి ఎవరిని ఇవ్వాలనే చర్చ నడిచిన నేపథ్యంలో అధినేత సైతం 'దగ్గుమళ్ల' వైపే మొగ్గ చూపినట్లు విశ్వసనీయ సమాచారం.

భక్తునికి ప్రాణం పోసిన పోలీసు గుర్రప్ప

శ్రీవారి సన్నిధిలో గుండెపోటు భక్తుడికి 'సీపీఆర్'

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల వెంకన్న సన్నిధిలో క్యూలైన్లో నిలుచున్న భక్తుడికి సడెన్‌గా గుండెపోటు వచ్చింది. అక్కడే ఉన్న ఓ పోలీస్ చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడాడు. 'నువ్వు దేవుడివి సామీ' అని ఆ కుటుంబం అంతా ఆ పోలీస్‌కు కతజ్ఞతలు చెప్పుకుంది. ఆగస్టు 15న రాత్రి తిరుమలలో జరిగిన ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడ్డాడు తెలంగాణకు చెందిన ఓ భక్తుడు. వివరాల్లోకి వెళ్తే..

సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లి కి చెందిన మేడం శ్రీనివాసులు (61) వెంకన్న దర్శనం కోసం కుటుంబంతో తిరుమల వచ్చాడు. శుక్రవారం (ఆగస్టు 15) రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం లడ్డూ ప్రసాదాలు తీసుకుని కుటుంబ సభ్యులతో లడ్డు కౌంటర్ల వద్ద నుండి మ్యూజియం వైపుకు వెళుతున్నాడు. పడమర మాడ వీధిలో ఉన్నట్లుండి శ్రీనివాసులుకు గుండెపోటు వచ్చింది. మాట్లాడుతుండగానే గుండెను పట్టుకుని కింద పడిపోయాడు శ్రీనివాసులు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్ టౌన్ పోలీస్ కానిస్టేబుల్ గుర్రప్ప గమనించి వెంటనే భక్తుడి దగ్గరికి చేరుకున్నాడు. సమయస్ఫూర్తితో 'సిపిఆర్' చేశాడు. దీంతో భక్తుడు కొంచెం కోలుకోగా వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు. అశ్విని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన తర్వాత తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత సదరు భక్తుడు ప్రాణాలతో బతికి బయట పడ్డాడు. డ్యూటీ డాక్టర్లు డిశ్చార్జ్ చేసి పంపించారు. సమయస్ఫూర్తితో స్పందించి భక్తుడిని కాపాడినందునకు భక్తులు, అధికారులు కానిస్టేబుల్ గుర్రప్పను అభినందించారు.



భక్తుని కాపాడిన కానిస్టేబుల్ గుర్రప్ప



వేడుకగా గోకులాష్టమి

ప్రజాశక్తి - తిరుమల



'భక్తుల భాగస్వామ్యంతో గోవులను రక్షించుకుందాం.. సంస్కృతిని కాపాడుకుందాం' అని టిటిడి ఈవో జె.శ్యామలరావు అన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శనివారం గోకులాష్టమి పురస్కరించుకుని గోపూజ మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో మొత్తం 2,789 గోవులు ఉన్నాయని, అందులో 1827 ఆవులు, 962 ఎద్దులు, 7 ఏనుగులు , 5 గుర్రాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో పూజా కైంకర్యాల నిమిత్తం దేశవాళీ గోవుల పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని గోశాల నుండి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు దైవ కార్యక్రమాలకే కాకుండా టీటీడీ పరిధిలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లలో వేచి ఉండే భక్తులకు, చంటి బిడ్డలకు, వద్ధులకు, అన్నప్రసాద వితరణ కేంద్రాలు, క్యాంటీన్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు ప్రత్యేకంగా పాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.గో శాలలో రూ.12.25 కోట్లతో ఎస్వీ పశుదాణా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గజరాజుకు పండ్లు అందించిన అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గోశాల సంచాలకులు శ్రీనివాస్, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్, సివి అండ్ ఎస్ఒ మురళీకృష్ణ, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ సి.దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలోనూ గోగర్భం డ్యాం చెంత ఉన్న ఉద్యానవనంలో కాళీయమర్ధనుడు అయిన శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకం చేశారు. అనంతరం ఉట్లోత్సవం నిర్వహించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

'ఆహ్వానం' అందక...

తూతూమంత్రంగా 'జెడ్‌పి'

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

అసలే వరుస సెలవులు.. ఆపై సరైన ఆహ్వానం అందలేదు.. దీంతో అంతంతమాత్రపు హాజరుతో, తూతూమంత్రంగానే జెడ్‌పి సమావేశం నడిచింది. ప్రజా సమస్యలపై చర్చే లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులుగా ఉన్న జెడ్‌పిటిసిలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వైసిపి ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆహ్వానం పంపాలని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు సర్దిచెప్పాల్సి వచ్చింది.వచ్చిన వారు సైతం అజెండా, సభ ముగియకముందే సభనుంచి నిష్క్రమించారు. 12 అంశాలను అజెండాగా పెట్టినా ప్రజా సమస్యలపై చర్చే లేకుండా పోయింది. 14 మంది ఎంఎల్ఎలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 16 మంది జెడ్‌పిటిసిలు, నలుగురు ఎంపిపిలు పాల్గొన్నారు. 50శాతంపైనే అధికార యంత్రాంగం గైర్హాజర్ కావడం గమనార్హం.

జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం ఉదయం సమావేశం జరిగింది. తమ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలకు వెచ్చిస్తున్న నిధుల వివరాలూ తమకు చెప్పడం లేదని అధికారులపై వైసిపి ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అనేక ప్రభుత్వ పథకాల బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.


ప్రజా సమస్యలపై చర్చేది..?

ప్రోటోకాల్ పాటించడం లేదని సత్యవేడు ఎంఎల్ఎ ఆదిమూలం, జడ్‌పిటిసి మెంబర్లు చెప్పగా జడ్‌పి ఛైర్మన్ స్పందిస్తూ త్వరలోనే కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రజాప్రతినిధులందరికీ ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో ఆహ్వానం పంపేలా చర్యలు చేపడతామన్నారు. యూరియా గురించి జడ్‌పిటిసి సభ్యులు అడగ్గా వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఇంతవరకూ 8,472 మెట్రిక్ టన్నులు అన్ని రకాల ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం 7,156 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మోడల్ స్కూల్స్ పనితీరుపై గుడిపాల ఎంపిపి అడగ్గా డిఇఒ స్పందిస్తూ జిల్లాలో మొత్తం 498 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయని, కుప్పం నియోజకవర్గంలో 35 మోడల్ ప్రైమరీ పాఠశాలలకు మెరుగైన సౌకర్యాల కోసం ప్రత్యేకంగా రూ.10 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఉన్న ఎంఆర్‌ఐ, సిటీస్కాన్ వసతులను వినియోగించి అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్న చిన్న కారణాలతో గర్భవతను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు.

పూతలపట్టు ఎంఎల్ఎ మురళీమోహన్ మాట్లాడుతూ దళితవాడల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మూడు జిల్లాల్లో 2,42,604 మంది షెడ్యూల్ కులాలు, తెగల వినియోగదారులుఉన్నారని, ప్రస్తుతం 200 యూనిట్లు సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. పెద్దమండ్యం మండలంలో వ్యవసాయ పంపుసెట్లకు 300 దరఖాస్తులు వచ్చాయని, రెండు నెలల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.



జెడ్‌పి సమావేశంలో గోవిందప్ప శ్రీనివాసులు



హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

అలిపిరిలో అగచాట్లు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీవారిని దర్శనం చేసుకోవాలంటే సామాన్య భక్తులు నలిగిపోవాల్సిందే.. ఎంతో భక్తిశ్రద్ధలతో దేవునికి ముడుపులు చెల్లించాలని వొక్కపొద్దులు ఉండి, కాలినడకన వచ్చే భక్తులు కొందరైతే, రైళ్లల్లో, బస్సుల్లో వచ్చి శ్రీవారి చెంత వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. క్షణకాలమే శ్రీవారిని చూసే భాగ్యం కోసం కుటుంబ సమేతంగా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. భక్తిశ్రద్ధలతో వస్తున్న వారికి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లు అరకొరనే చెప్పాలి. 'ఎఐ' టెక్నాలజీతో భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పిస్తామని పదేపదే చెబుతున్నప్పటికీ మాటలే తప్ప చేతల్లో లేదనే చెప్పాలి. ఇప్పటికీ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని ఇబ్బందులు పడక తప్పడం లేదు. క్యూలైన్లలో ఉండేవారికి కేవలం తాగునీరు తప్ప, పాలు, అన్నప్రసాదాలు ఇవ్వడం లేదు.

ఆన్‌లైన్‌లో టోకెన్ పొందిన వారు కాకుండా, ఆఫ్‌లైన్‌లో ఉండే భక్తుల కోసం టికెట్లు పొందేందుకు తిరుమల కాకుండా తిరుపతిలో అలిపిరి, విష్ణువాసం, శ్రీనివాసంలలో రోజుకు 12వేల టికెట్లను విడుదల చేస్తారు. ఎక్కువగా స్థానికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. అయితే తమిళనాడు, కర్నాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లోన ఇతర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ లభించనివారు సైతం ఆఫ్‌లైన్‌లోనూ రావడంతో ఎలాగైనా శ్రీవారిని దర్శించుకోవాలని ఇతర రాష్ట్రాల భక్తులు సైతం ఈ టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలిపిరి బాలాజీ బస్టాండ్ దగ్గర టిటిడి ఐదు షెడ్లలో 15వేల మంది భక్తులు నిరీక్షించేలా ఏర్పాటు చేశారు. వారాంతపు సెలవులు మూడు రోజులు సెలవు దినాలు కావడంతో శుక్రవారం నుంచి రద్దీ ఎక్కువయ్యింది. శనివారం ఐదు గేట్లు నిండిపోయి దాదాపు మూడువేల మంది భక్తులు ఎండలోనే క్యూలైన్‌లో నిల్చున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన భక్తులు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మథుర ప్రాంతానికి చెందిన రాహుల్ ఏడుగురు కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంటకు రైలు దిగి టికెట్ల కోసం అలిపిరికి చేరుకున్నాడు. షెడ్డు గేట్లు మూడు గంటలకు తెరవడంతో క్యూలైన్‌లోకి వెళ్లారు. రాహుల్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నీళ్లు తప్ప టిటిడి ఏమీ ఇవ్వలేదని, ఉదయం నుంచి ఆకలితో అల్లాడామని, బయటకు వెళ్లి ఏమైనా తినాలంటే ఎక్కడ వెనకబడిపోతామోనని క్యూలైన్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. తిరుమలలో ఏ విధంగా అయితే అన్నప్రసాదాలు ఇస్తున్నారో ఆ విధంగా టికెట్ల క్యూలైన్‌లోనూ పంపిణీ చేయాలని కోరుతున్నారు.

శ్రీవారి టోకెన్లకు 14 గంటలు నిరీక్షణ

అన్నప్రసాదం సరఫరా చేయని టిటిడి

స్విగ్గి, జొమాటోకు భలే డిమాండ్

అలిపిరి టోకెన్ల జారీ కేంద్రంలో శ్రీవారి దర్శనం టికెట్లు పొందాలంటే 10-15 గంటల సమయం పడుతున్న నేపథ్యంలో భక్తులు అకలికి తట్టుకోలేక స్విగ్గి, జొమాటోలకు ఆర్డర్ పెట్టించుకుని తిని కడుపు నింపుకుంటున్నారు. ఆంధ్ర, తెలంగాణా, స్థానిక భక్తులు మాత్రం ముందే తెలుసుకుని ఆర్డర్ పెట్టుకుంటున్నారు. హిందీ, తమిళం, కన్నడం రాష్ట్రాల వారు పస్తులుంటున్నారు. బాగా చదువుకున్న యువత ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకుంటున్నారు.

అన్నప్రసాదాలు ఇవ్వాలి : శ్రీనివాసులు, పులివెందుల



తిరుమల తరహాలో టోకెన్ల కోసం క్యూలైన్‌లో నిల్చున్నవారికి టిటిడి అధికారులు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేయాలి. ఎక్కువమంది చంటిపిల్లలు ఉండటం వల్ల పాలు ఖచ్చితంగా ఇవ్వాలి. కుటుంబ సమేతంగా ఆధార్‌కార్డులు చూపించాల్సి ఉండడంతో బీపీ, సుగర్ ఉన్నవారు ఆకలితో అల్లాడాల్సి వస్తోంది.

'స్మార్ట్ దోపిడీ'పై వామపక్షాల ధ్వజం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

విద్యుత్ వినియోగదారులను 'స్మార్ట్'గా దోపిడీ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టే స్మార్ట్ మీటర్లపై వామపక్షాలు ధ్వజమెత్తాయి.. ప్రతిపక్షంలో ఉన్నపుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పి, నేడు మంత్రి అయిన తరువాత వైసిపి తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లనే గుట్టుచప్పుడు కాకుండా అమరుస్తున్నా గమ్మునే ఉన్నారని నేతలు ధ్వజమెత్తారు. నెలరోజులుగా 'స్మార్ట్ మీటర్లను తిప్పికొట్టండి' అని ఊరూరా స్మార్ట్ దోపిడీని వివరించే కరపత్రాలను పంచిపెట్టారు. ఈనెల 11న సోమవారం జిల్లావ్యాప్తంగా స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున వామపక్షాలు విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలిపాయి.

గత వైసిపి ప్రభుత్వం తొమ్మిదిసార్లు కరెంట్ ఛార్జీలు పెంచి రూ.32వేల కోట్ల భారం మోపిందని టిడిపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఒకటే ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించేది లేదని, బిగించిన వాటిని పగలగొడతామని వినియోగదారులను నమ్మబలికింది. అయితే సర్దుబాటు ఛార్జీల పేరుతో వైసిపి హయాంలో అదనంగా వాడినదంటూ 'ట్రూఅప్' మోత మోగించింది. ప్రతినెలా అదనంగా ఇంధన సర్దుబాటు ఛార్జీలను బాదుతూనే ఉంది. సర్దుబాటు ఛార్జీల భారం మీదే అని వైసిపి, కాదు మీదే అని కూటమి ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వినియోగదారులను వాయించేస్తున్నారు ఆదాయాలు పెరగక, కరెంట్ బిల్లులు కట్టలేక సామాన్యులు అవస్థలు పడుతున్నారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు సైతం చతికిలబడుతున్నాయి. 'ట్రూ అప్' భారాలు మోపడంలో వైసిపి, కూటమి దొందూదొందే అని వామపక్షాలు ఢంకా భజాయించి చెబుతున్నాయి.

ట్రూఅప్ భారాల మాట అటుంటే, స్మార్ట్‌మీటర్ల పేరుతో అదానీ కంపెనీ రాష్ట్రంలో 2 కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి, కొత్తవి బిగించే ప్రయత్నం చేస్తోంది. విద్యుత్ ప్రైవేటీకరణలో తొలి అడుగు ఇదని వామపక్షాలు ఈ చర్యను తిప్పికొడుతున్నాయి. అయితే వినియోగదారుల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో అదానీ స్మార్ట్ మీటర్లను బిగించే సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా వినియోగదారులు లేని సమయం చూసి బిగించేసి వెళ్లిపోతుండటం గమనార్హం. సెల్‌ఫోన్ తరహాలోనే ముందుగానే కరెంట్‌కు రీఛార్జి చేయించుకోవాలని విస్తృత ప్రచారం జరగడంతో వినియోగదారులు సైతం బెంబేలెత్తుతున్నారు. ఈ మీటర్ ఖర్చు సింగిల్ ఫేస్ 9 వేలు, త్రీఫేస్ 17వేలును ఎనిమిది సంవత్సరాల్లో వాయిదాల పద్ధతిలో జనం నుంచి వసూలు చేస్తారు. మరోవైపు కరెంట్ ఎక్కువ వాడే సమయంలోనూ టారిఫ్ విధింపు వేరే విధంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తిరుపతి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున వినియోగదారులు వామపక్షాల నిరసన కార్యక్రమాల్లో పాల్గొని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని పెద్దపెట్టున నినదించారు. లేనిపక్షంలో మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని నేతలు హెచ్చరించారు.



వినాయక చవితి నిర్వాహకులతో సమావేశమైన సీఐ సంగమేశ్వరరావు

డీజే సౌండ్స్ పెడితే కేసులు: సీఐ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : వినాయక చవితి వేడుకల్లో డీజే సౌండ్స్, బాణాసంచాలు పేలిస్తే చట్టపర చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని సీఐ సంగమేశ్వరరావు హెచ్చ రించారు. శనివారం ఆయన దొరవారిసత్రం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలోని వినాయక చవితి ఆర్గనైజేషన్‌లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు నిర్వహించేవారు పోలీసు స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేకమైన కార్య కలాపాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ఎస్ఐ అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు ఉత్సవ కమిటీలకు బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ట్రైనింగ్ ఎస్ఐ సుధీర్‌రెడ్డి శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలో సమావేశమై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు అవసరమని, ఏడు రోజుల ముందు సంబంధిత పోలీస్ స్టేషన్, మున్సిపల్ అధికారుల నుండి పర్మిషన్ తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హారతికి ఉత్తమ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న కానిస్టేబుల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి హారతి విధి నిర్వహణలో ప్రజలకు అధికారులకు మంచి సేవలు అందించి నందుకు ప్రభుత్వం ఉత్తమ సేవ అవార్డు ప్రకటించింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిస్సాంత్ కుమార్ చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రం అందుకున్నారు. విజయవాడలో ఈ ప్రశంసా పత్రం ఆమె అందుకున్నారు.

తెలుగు గంగ కార్మికులకు ప్రశంసలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తెలుగు గంగ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కమిషనర్ ఆదేశాల మేరకు కార్మికుల సేవలు గుర్తించి ప్రశంస పత్రాలు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు శనివారం పట్టణంలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు కూడా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వారు చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంస పత్రాలతో సత్కరించడం సంతోషించ దగ్గ విషయం అన్నారు. కార్మికుల సేవలను గుర్తించిన కార్పొరేషన్ లో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు సహకరించడంతోనే కార్మికులకు ప్రశంస పత్రాలు ఇచ్చారు. కార్మికులు మరింత రెట్టింపు ఉత్సాహంగా పనిచేస్తారని కొనియాడారు. ప్రతి ఏడాది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు అధికారులు ప్రోత్సహించి ప్రశంస పత్రాలు ఇవ్వాలని కోరారు. ప్రశంస పత్రాలు కార్మికులకు ఇచ్చేందుకు సహకరించిన అడిషనల్ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు కృతజ్ఞతలు తెలిపారు.

'ఫిర్యాదుల పెట్టె' ఉంది జాగ్రత్త!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేస్తున్నామని, సిబ్బంది తస్మాత్ జాగ్రత్త అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం ఆమె ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం, మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది పనితీరు పట్ల ఎలాంటి అభ్యంతరాలున్నా ఫిర్యాదులు రాసి పెట్టెలో వేయాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ద్వారా ఫిర్యాదుల పెట్టెను తెరిచి రోగులు, వారి బంధువుల నుంచి ఏమైనా ఫిర్యాదులు వచ్చి ఉంటే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉన్నత విలువలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరడం వల్ల విద్యార్థులకు ఉన్నత విలువలు పెంపొందుతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ బి రమేష్ బాబు అన్నారు. స్థానిక బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇటీవల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులైన స్కౌట్స్ విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు విస్తరణ నుండి క్రమశిక్షణ, సేవా నిరతి, దేశభక్తి వంటి ఉత్తమ లక్షణాలు అలవరిచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్ వంటి సర్టిఫికెట్ పొందిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలకు 0.05 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. షేక్ అజారుద్దీన్, ఎస్ కె రఫీ, మునిరాజ, ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ముక్కంటికి రూ.లక్ష విరాళం



ముక్కంటి ఆలయానికి విరాళం అందిస్తున్న దాత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి కుమారదేవం గ్రామానికి చెందిన కాసాని శ్రీహరి గౌడ్ దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శనివారం రూ.లక్ష విరాళం అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈవో మోహన్ కు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాలని సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

గోశాలకు లక్ష విరాళం..

శ్రీకాళహస్తీశ్వర స్వామి అనుబంధ గోశాలకు గుంటూరుకు చెందిన అద్దేపల్లి దీప్తి మహేశ్వరి దంపతులు శనివారం రూ. లక్ష విరాళంగా అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈఓ మోహన్ కు అందజేసి గోవు సంరక్షణార్థం వినియోగించాలని కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.



పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ బీమాల మునిశ్వర్ల పుట్టినరోజు వేడుకలు శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజగోపురం వద్ద మునిశ్వర్ల స్నేహితుల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన పుట్టినరోజు నాడు పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని మునిశ్వర్ల తెలిపారు.

వరదలా పొంగుతున్న డ్రైనేజీ

- ఎన్నిసార్లు విన్నవించినా పట్టని అధికారులు
- యశోదనగర్‌లో వారం రోజులుగా ఇదే పరిస్థితి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: యశోద నగర్ మెయిన్ రోడ్ నుండి లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, సిపిఎం ఆఫీస్ రోడ్డు మీదుగా వెళుతున్న డ్రైనేజీ వారం రోజుల నుంచి పొంగిపొర్లుతూ ఒక వరదలా ప్రవహిస్తోంది. దాన్ని ప్రతి ఇంటి ముందు మురికి నీరును తొక్కుకొని ఇంటిలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు దాటాలంటే ఆ మురుగునీరుని తొక్కుకొని వందలాది బండ్లు మనుషులను, దాటాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల అక్కడ నివసిస్తున్న కుటుంబాల అందరికీ అనారోగ్యంతో తీవ్రమైన జర్వాలతో ఆసుపత్రిలో చేరారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం ఏమీ లేకపోయింది. యశోద నగర్ రైల్వే కాలనీ ఎక్కడ చూసినా డ్రైనేజీ పొంగుతూనే వుంది. శుక్రవారం మున్సిపాలిటీ అధికారులకు వీడియో తీసి పంపాం..సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డిఈ కి వీడియోలు తీసి పంపినా ఏమాత్రం స్పందించడం లేదు. ఇలా మురికి కాలువలు పొంగుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గం. ఇప్పటికైనా నదిలాగా పొంగుతున్న ఆ డ్రైనేజీని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కొనసాగుతున్న నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని, ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 59వ రోజుకు చేరాయి. ఆ యూనియన్ జాయింట్ సెక్రెటరీ చిరంజీవి మాట్లాడుతూ అవినీతి, అక్రమాల రామారావుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ దళిత కార్మికుల్ని నానా దుర్భాషలాడుతున్న రామారావు పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, సుబ్రహ్మణ్యం , సుబ్బయ్య, కిష్టమ్మ పాల్గొన్నారు.

కుక్కల సంచారంపై మున్సిపాల్టీ చర్య



కుక్కలను పట్టి వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవలి వీధి కుక్కల సంచారం పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవు తున్నారు. ముఖ్యంగా కార్వేటినగరం రోడ్డు, కృష్ణానగర్, లక్ష్మీనగర్, వేదవ్యాస స్కూల్, జెండా మాను వీధి, కాలనీల్లో కుక్కలు అధికం కావడం వల్ల కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాల్టీ అధికారులు చర్యలు చేపట్టారు. పశుసంవర్ధక శాఖ సహకారంతో ప్రత్యేక వాహనం ద్వారా వీధి కుక్కలను పట్టుకుని మున్సిపాల్టీ ఆధీనంలోని కుక్కల సంరక్షణ కేంద్రానికి తరలిం చారు. అధికారులు మాట్లాడుతూ ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, మున్సిపాల్టీ తరపున నిరంతరం చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. కుక్కల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను మున్సిపాల్టీకి వెంటనే తెలపాలని పౌరులను కోరారు.

25న వినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: శ్రీ వినాయక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ ఆవరణలో పలు గ్రామాలకు వినాయక విగ్రహాలు అందిస్తామని అందుకు సంబంధించిన టోకెన్లను నేడు భక్తులకు అందిస్తామని తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్టు వరత్తూరుకు చెందిన తిరిమెల్ల జయ చంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు తిరిమెళ్ల సురేందర కుమార్ రెడ్డి తిరుచానూరులో యోగి మల్లవరంలోని శివాలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వినాయక విగ్రహాలను అందుకునే భక్తులు ఈ నెల 25వ తేదీ విగ్రహాలు తీసుకోవాలని ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు సురేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుల రాజకుమార్, ప్రముఖ న్యాయవాది రాజగోపాల్, జర్నలిస్టు తులసీరామ్, అక్కుర్తి ఆనంద్ రెడ్డి , భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎస్‌పి



లడ్డూ ప్రసాదం అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం (పాకాల): చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామ సమీపంలో ఆనంద గిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పోలీస్ శాఖ తరపున స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ నియోజకవర్గాల నుండి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక క్యూ లైన్లు, భోజనం, తాగునీరు, ఉచిత వైద్య శిబిరం, కారు పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు, ఆలయ సిబ్బందిని సమన్వయం చేస్తూ పర్యవేక్షించారు. పేటమిట్టుకు చెందిన గల్లా రాజశేఖర్ నాయుడు లడ్డూ ప్రసాదం అందించారు. చంద్రగిరి డిఎస్‌పి బి ప్రసాద్ పర్యవేక్షణలో పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డిలు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు హరికథ కాలక్షేపం, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిపాలన అధికారి యువరాణి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

స్విమ్స్‌కు రూ. పది లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రిలో శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి తిరుపతి నగరానికి చెందిన హైదరాబాద్ హెచ్‌సిఎల్ కంపెనీలో సాఫ్ట్ వేర్‌గా విధులు నిర్వహిస్తున్న వి రజనీకుమారి, భర్త ఎంవిఆర్ ప్రసాద్ పది లక్షల రూపాయలు విరాళంగా అందించారు. స్విమ్స్ హాస్పిటల్ వారు పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలకు విరాళాన్ని చెక్ రూపంలో తన సోదరి స్విమ్స్ ఉద్యోగి సూపరింటెండెంట్ ధనలక్ష్మి ద్వారా స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్‌కి అందించారు. ఈ సందర్భంగా దాతకు డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఒంగోలులో నిర్వహించనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను బుచ్చినాయుడు కండ్రిగలో ఆ పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న మహాసభల ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల పై, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు చిన్నిరాజ్, కత్తి ధర్మయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉక్కు పాదం మోపుతామని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహ మూర్తి తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.



ట్రాఫిక్ సమస్య పైనా దృష్టి సారించారు. ఇకపై శ్రీకాళహస్తి పట్టణం, శివారు ప్రాంతాల్లో నిఘా కెమెరాల నీడలో ఉంటాయనీ, నేరస్తులు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. సీఐలు గోపి, నాగార్జున రెడ్డి, తిమ్మయ్య, ఎస్ఐలు నరసింహులు, బలరాం, పిఎస్ఐలు పాల్గొన్నారు.

మండల సమాఖ్య క్లస్టర్ కో ఆర్డినేటర్ మృతి



మణెమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు గ్రామ పంచాయతీ మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్ పాలూరు మణెమ్మ (50) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గూడూరు మండలం చిల్లకూరుకు చెందిన ఆమె ఈమె దొరవారిసత్రం మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యానికి గురైన ఆమె నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతిరాలుకు నలుగురు పిల్లలు వున్నారు. మండల వెలుగు సిబ్బంది, ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి గూడూరు టౌన్ , వెస్ట్ క్లబ్స్ సేవ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు శనివారం సరుకు లు పంపిణీ చేశారు. పాస్ట్ జోన్ ఛైర్మన్ గురునాధం మనువడు పుట్టిన రోజు సందర్భంగా ఈ సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వి రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిం చాలన్నారు. క్లబ్ సభ్యుల సహకారం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ సుధాకర్ , వెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ జయ చంద్ర రెడ్డి , ట్రెజరర్ గోపినాథ్ రెడ్డి, మురళి నాయుడు , చంద్ర శేఖర్ రెడ్డి , పాస్ట్ ప్రెసిడెంట్ ఎస్ఎల్ఎన్ స్వామి , పాస్ట్ రవీంద్ర రెడ్డి, బాబు రావు, హరికృష్ణ , భాస్కర్ రెడ్డి , ఇంతియాజ్, హైమావతి పాల్గొన్నారు.

జాప్యం ఎందుకు?

జెడ్‌పిలో నియోజకవర్గ సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్యే



ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై జాప్యం చేయడం ఏమిటని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిలదీశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రధానంగా పంచాయతీ రాజ్ శాఖ నిర్మిస్తున్న సత్యవేడు గెస్ట్ హౌస్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని సభ దృష్టికి తెచ్చారు. నారాయణవనం మండలంలోని తిరువట్యం, తుంబూరు, పాలమంగళం, కేవిబి పురం సీకే పూడి, నాగలాపురం మండలంలోని ద్వారకా నగర్ వద్ద వంతెనలు వర్షం పడ్డ ప్రతిసారి కొట్టుకుపోతున్నాయని, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని శాశ్వత సమస్య పరిష్కారం కోరి పలుమార్లు విన్నవించినా జాప్యం చేయడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. దాసుకుప్పం రోడ్డు నిర్మాణానికి గతంలో ఇచ్చిన అలైన్ మెంటులో మార్పు చేసి పంపడంపై అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, నాగలాపురం మండలం టీపీ కోట రోడ్డు నిర్మాణం పై ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించానని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అధికారులు అంకిత భావం తో పనిచేసి ని యోజక వర్గం అభివృద్ధికి సహకరిం చాలని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు సత్యవేడు నియోజకవర్గం లోని పెండింగ్‌లో వున్న వంతెన లు, రోడ్ల జాబితాను ఎమ్మెల్యే సభకు సమర్పిం చారు. ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై ప్రివిలైజేషన్ కమిటీకి, స్పీకర్ కు ఫిర్యాదు చేస్తామని తప్పక చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నారాయణ వనం జెడ్పీటీసీ కోనేటి సుమన్ కుమార్ తన మండలంలోని రోడ్లు, వంతెనలు సమస్యలు పరిష్కరించాలని సభలో కోరు తూ జడ్పీ చైర్మన్‌కు, సీఈవోకు వినతిపత్రం సమర్పించారు.

నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్‌లో 2026 విద్యా సంవత్సరంలో ఎనిమిదో (8వ)తరగతి ప్రవేశానికై జాతీయ స్థాయిలో 7వ తేదీ డిసెంబర్ 2025న ప్రవేశ పరీక్ష నిర్వాహిస్తారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టరు ఎన్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు 02 జూలై 2013 నుంచి 01 జనవరి 2015 మధ్య జన్మించిన విద్యార్థిని, విద్యార్థులు అర్హులు అని, ప్రవేశ పరీక్ష విధానం దరఖాస్తులు కోసం, వివరాలకు 9399976999 , 8688888802 03 నెంబరులకు, వరదరాజనగర్ లోని విశ్వం సైనిక్, మిలిటరీ పోటీ పరీక్షల సమాచార కేంద్రంను సంప్రదించ వచ్చునని తెలిపారు.

ఉత్తమ వైద్య సేవలకు అవార్డులు ప్రదానం




ప్రశంసాపత్రాలు పొందిన వైద్యులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) వైద్య విభాగంలో అత్యుత్తమ సేవలు అందించిన వైద్యులు, ఉద్యోగులు పలువురు ఎస్‌వియూనివర్సిటీ, తారకరామా స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కలెక్టర్ డాక్టర్ ఎస్ వేంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాలను అందుకున్న అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సమంత్‌రే, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రజా సంబంధాల విభాగం వి రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎల్ సతీష్‌లను స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ అభినందించారు.

ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారలేదు..

మధ్యాహ్న భోజన కార్మికుల ఆవేదన



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు

ప్రజాశక్తి-నాయుడుపేట: ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకుల మాత్రం మారలేదని మధ్యాహ్న భోజన కార్మికు లు ఆవేదన వ్యక్తం చేశారు. నాయుడు పేట సిఐటియు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం భోజనం కార్మికులు వారి సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఫజిరియ, కె విజయమ్మ హాజరయ్యారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుందా, మధ్యాహ్నం భోజనం కార్మికుల జిల్లా కార్యదర్శి కె విజయమ్మ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చి స్కూలు విలీనం పేరుతో మధ్యాహ్నం భోజన కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులు కి కనీసం వేతనం వర్తించడం లేదని, ఉద్యోగ భద్రత లేదని, కనీసం మెనూ పాటించాలని చెప్పే వారు ఒక్కొక్క విద్యార్థికి కనీసం 20 రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వాళ్ల డిమాండ్లు తెలుపుతూ విలీనం పేరుతో ఉద్యోగం నుంచి తొలగించిన కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండు చేశారు. 10 నెలలు వేతనాన్ని 12 నెలలకు పొడిగించాలని, రాజకీయ వేధింపులను అరికట్టాలని సూచించారు. తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం మండల నాయకులు వెంకటగిరి రోజా, సుగుణమ్మ, కోట లక్ష్మి, చిల్లకూరు ప్రమీలమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



అటవీ అధికారుల అదుపులో ఎర్రచందనం దొంగ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి నెల్లూరు జిల్లా పెంచలకోన వద్ద నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశామని టాస్క్ ఫోర్సు పోలీసులు శనివారం తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. పెంచలకోన ఈదల చెరువు వద్ద కొంత మంది వ్యక్తులు కనిపించారని వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయడంతో కొందరు అక్కడి నుంచి పారిపోయారన్నారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఒక వ్యక్తిని పట్టుకోగలిగారన్నారు. ఆ వ్యక్తి సమీపంలో నాలుగు ఎర్రచందనం దుంగలు ఉండడాన్ని గమ నించామన్నారు. పట్టుబడిన స్మగ్లర్ నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వ్యవసాయ కూలి పనికి వెళ్లి ట్రాక్టర్ వెనుక టైర్ కింద పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పుత్తూరు మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన వి రమేష్ (49) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. వడమాల పేట మండలం బేరివాని కండ్రిగ గ్రామానికి కూలి పనికి వెళ్లి ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆయనను తిరుపతి అమర హాస్పిటల్ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై రామచంద్ర హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆర్థిక సాయం లేకపోవడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకి అప్పగించారు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మండలంలోని కొత్తకండ్రిగ వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తొట్టంబేడు పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు పోలీసుల కథనం మేరకు మండలంలోని కొత్త కండ్రిగ పరిధిలో తెలుగుగంగ కాలవ వద్ద సలీం, అల్లా బక్ష్ 20 కేజీల గంజాయిని ప్యాకింగ్ చేస్తుండగా తొట్టంబేడు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించారు.

ఘనంగా డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, రైతు బాంధవ్యుడు, 'సర్దార్' అనే బిరుదుతో ప్రసిద్ధి చెందిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడని, ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పనిచేశారు. స్ఫూర్తి దాయక జీవితం, అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను మరువకుండా తప్పక స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని మీటింగ్ హాలులో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి బిసి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సంఘ నాయకులతో కలసి కలెక్టర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చంగయ్య, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి జ్యోత్స్న, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రమేష్ బాబు, తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, సంఘ నాయకులు కిరణ్, వెంకట మణిబాబు, బీసీ సంఘ నాయకులు మనుశేఖర్,మల్లికార్జున, రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

తిరుపతి ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఇస్కాన్‌కు విచ్చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రభువులు డాలర్స్ దివాకర్ రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లను చేసి తీర్థ ప్రసాదాలను అందించారు.

శాంతియుత రాజ్య స్థాపనే లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తిరుపతి: శాంతియుత రాజ్య స్థాపన కోసం సీపీఐ నాయకత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం 'జనసేవ దళ్' రెండు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ కమ్యూనిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ సౌభాగ్యం కోసం అందరూ కలిసి పాటుపడాలని సూచించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'జనసేవ దళ్' విపత్తులు, పార్టీపై వ్యతిరేక శక్తుల నుంచి రక్షణ కవచంలా నిలుస్తుందని, ఈ దిశగా యువతకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎంపీ

ప్రజాశక్తి-నాయుడుపేట:

నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం లోని శ్రీరామ మందిరంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు యాదవ సంఘం నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఎస్ జె జ్యువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, యాదవ సంఘం నాయకులు భారతాల సాయిరామ్ కిషోర్, అత్తికాయల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు లోని అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం స్థానిక శివాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి కమిటీలు వేసి ఆస్తుల వెరిఫికేషన్ చేస్తోందని బాధితులు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని మనందరం కలిసి కృషి చేస్తే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు కాలయాపనచేయకుండా సమస్యని ఒక కాల పరిమితి లోపు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో జరిగే ఉద్యమానికి బాధితులు అందరూ భాగస్వాములు కావాలని బాధితులను కోరారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కమిటీలు వేసి సమస్య పరిష్కారం చేయడానికి ముందుకు వచ్చినందుకు ప్రభుత్వమే అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఒక కాల పరిమితులు ఈ సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో అసోసియేషన్ తీసుకునే నిర్ణయానికి అందరూ కలిసి రావాలని కోరారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా చిత్తూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జీవీ ప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్, స్థానిక అసోసియేషన్ నాయకులు సి కృష్ణయ్య, బాధితులు పాల్గొన్నారు.



21న జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 21వ తేదీ గూడూరు పట్టణం లోని డిఆర్‌డబ్ల్యూ కలశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ముందంజలో ఉండాలని ముఖ్యమంత్రి నిరంతరం పనిచేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఎంతో మందికి స్కిల్స్ నేర్పించి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే లోకేష్ యువతకు 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తానని మాటిచ్చారన్నారు. అందులో భాగంగానే ప్రతి నెల ఏపీ ఎస్-ఎస్‌డిసి ద్వారా జాబ్ మేళా నిర్వహించి యువతకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి నియోజక వర్గంలో ఏడు సార్లు జాబ్ మేళా నిర్వహించి దాదాపుగా 520 మందికి పైగా ఉపాధి కల్పించామన్నారు. అందులో భాగంగా ఈ నెల 21వ తేదీ గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కాలేజ్‌లో 16 కంపెనీలతో దాదాపు 680 మంది ఉద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నియోజక వర్గం పరిధిలోని నిరుద్యోగ యువత ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు , జిల్లా నైపుణ్యాధికారి లోకనాధం , ప్లేస్ మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.